క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వినతిపత్రం అందజేశారు. పిన్నారం, లింగన్నపేట గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సరైన రోడ్డు సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీవైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు కొండు వెంకటి, తిరుపతి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

చెన్నూర్: పట్టణానికి చెందిన సోలంకి శ్రీను అనే వ్యక్తి మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. నిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయాల్సి ఉంది. రూ.2లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించడంతో నిరుపేద కుటుంబానికి చెందిన సోలంకి శ్రీను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిశారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందించారు. నిరుపేద ఆపరేషన్ కోసం రూ.2లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని శ్రీను కుటుంబ సభ్యులు ప్రకాశ్‌కు అందజేశారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యార్థులతో పవర్ ప్లాంట్ డీజీఎం పంతులానాయక్, వేణుగోపాల్

భీమారం: మండలంలోని పోలంపల్లి సమీపంలోని అనాథాశ్రమంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల మరణించిన జైపూర్ ఎస్టీపీపీ ఇంజినీర్ కిరిటీ జ్ఞాపకార్థం డీజీఎం పంతులానాయక్, వేణుగోపాల్‌లు కలిసి విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలతో పాటు పెన్నులు, పెన్సిళ్లు, పరీక్షా ప్యాడ్లు అందజేశారు. ఇందులో సురేష్(సేఫ్టీ), ప్రసాద్, రాకేష్, మహేష్, పవర్‌మేక్ అధికారులు సాగర్ మిశ్రా, వరప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



ఆవిష్కరిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని బీజోన్ ఏరియాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, నాయకులు ఆశయ్య, రాములు, వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చిన్నారి మృతికి నివాళులు



నివాళులర్పిస్తున్న వాకర్ సభ్యులు

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి గ్రామంలో ఆరేళ్ల వయస్సు గల చిన్నారిని గంజాయి మత్తులో ఎత్తుకెళ్లి, అత్యాచారం చేసి చంపిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ, ఆ చిన్నారి చిత్ర పటానికి పూలమాలలు వేసి రాముని చెరువు వాకర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం నివాళులర్పించారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, భాస్కర్‌రావు, బూర్ల జ్ఞాని, సలహాదారులు డాక్టర్ త్రినాథరావు, డాక్టర్ సల్మాన్‌రాజు, జి.సత్యనారాయణ మూర్తి, వీర శంకర్, సిరిపురం శ్రీనివాస్, మొగిలి, కె. రామస్వామి, జగన్, విశ్వం ప్రసాద్‌లు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో ముస్లిం యువకుడిని ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఏసీపీ



దండేపల్లి: తాళ్లపేటలో ముస్లింల ప్రార్థనలు





భక్తి ప్రపత్తులతో బక్రీద్

బెల్లంపల్లి/నెన్నెల/దండేపల్లి/చెన్నూర్/జన్నారం/భీమారం/తాండూర్/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/జైపూర్/కాసిపేట/మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట: త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్‌ను ముస్లింలు జిల్లా వ్యాప్తంగా సోమవారం భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. సాంప్రదాయ కొత్త బట్టలు ధరించి సమీప మసీదులు, ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండగ సందేశాన్ని అందించారు. మత సామరస్యాలు వెల్లివిరియాలని అల్లాను ప్రార్థించారు. ప్రార్థనలు ముగిశాక ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలువురు హిందువులు ముస్లింలకు ఈద్గా వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మందమర్రిలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింలకు, జైపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్ ఇంటికి వెళ్లి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కొందరు ముస్లింలు ఇళ్లలో మేకలను కుర్బానీ ఇచ్చారు. ఆ కుర్బానీ ఇచ్చిన మాంసాన్ని పేద ప్రజలందరికీ పంచిపెట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చెన్నూర్‌లో ప్రార్థనా స్థలాన్ని జైపూర్ ఏసీపీ సందర్శించారు. తాండూర్‌లో ఎంప సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, జిల్లా ఓబీసీ చైర్మన్ వడ్డే రాజమౌళి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేశ్, కౌన్సిలర్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు. బెల్లంపల్లిలో ఏసీపీ రవికుమార్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, ఎస్సై రమేష్, చెన్నూర్‌లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఫయాజ్‌లు, నెన్నెలలో మత గురువు సగీర్ హైమద్ పాల్గొన్నారు. తాండూర్‌లో జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, సహకార సంఘం మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



దేవాపూర్‌లో ఈద్గా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



లక్సెట్టిపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మంచిర్యాలఅర్బన్: శుభాకాంక్షలు చెబుతున్న భానేశ్



తాండూర్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



బెల్లంపల్లి: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు చెప్పకుంటున్న ముస్లింలు



చెన్నూర్ దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



భీమారం: వేడుకల్లో ముస్లింలతో పోలీసులు



జైపూర్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే వివేక్

తొలగని 'పోడు' అడ్డంకులు!



ఎడ్లతో పోడు భూమి దున్నుతున్న రైతు

- పోడు భూముల్లో సాగును అడ్డుకుంటున్న అటవీ అధికారులు
- ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం పేరుతో నిబంధనలు
- ట్రాక్టర్ వినియోగించొద్దని అన్నదాతలపై ఒత్తిడి
- హక్కు పత్రాలు ఉన్నా పంటలు వేయలేకపోతున్న రైతులు

కోటపల్లి: ఫారెస్టు అధికారుల తీరుతో జిల్లాలో రోజుకో ప్రాంతంలో పోడు సమస్య తీవ్రంగా మారుతోంది. పోడు రైతులకు పట్టాలున్నా.. అధికారుల అత్యుత్సాహమే వారిని రెచ్చగొడుతూ అధికారులపై దాడులు జరిగేలా చేస్తున్నాయని గిరిజన నాయకుల వాదన. ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా పోడు సమస్యలకు పరిష్కారం చూపడంలేదు. పోడు భూములను సాగు చేస్తుంటే, అటవీశాఖ అధికారులు అకస్మాత్తుగా దాడులు చేసి ట్రాక్టర్, కాడెద్దులు స్వాధీనం చేసుకుంటున్నారు. అసలే పోడు రైతుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో, అటవీశాఖ అధికారుల దెబ్బకు కోలుకోలేక పోతున్నారు. చేసేది ఏమీ లేక, వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. చేతికొచ్చిన పంట కళ్ల ముందే ధ్వంసం కావడంతో ఊపిరి తీసుకుంటున్నారు. ఉన్న కాస్త పోడు భూమిని వదులుకోక, కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అయినా అటవీశాఖ అధికారులు కనికరం చూపించకపోవడంతో పంటల సాగుకు దూరమవుతున్నారు. అటవీ భూముల్లోకి చొరబడితే.. అడ్డుకుని తీరుతామని అటవీశాఖ అధికారులు హెచ్చరించడంతో జిల్లాలో ఇప్పుడు పోడుసాగు భయం భయంగానే సాగుతోంది.

వానకాలం పంటల సాగు నేపథ్యంలో ఇప్పటికే పలువురు రైతులు భూములను దుక్కిదున్ని సిద్ధం చేసుకుంటున్నారు. నాగళ్లతోనే దున్నాలంటున్నారని రైతులు వాపోతున్నారు. గిరిజన గ్రామాల్లో ఎడ్లబండ్లు లేకపోవడం, కొందరి భూముల్లో పెద్ద పెద్ద రాళ్లు ఉండటంతో ఎడ్లతో, నాగళ్లతో దున్నే పరిస్థితి లేదని పోడు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ భూముల్లో సాగు చేసిన గిరిజన రైతులకు, గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ ప్రభుత్వ హయంలో కొంతమందికి పట్టాలివ్వగా, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గిరిజన రైతులకు హక్కుపత్రాలను జారీ చేసింది. జిల్లాలో సుమారు 10వేలకు పైగా గిరిజన రైతులు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా, వీటిలో ఎఫ్‌ఆర్‌సీ కమిటీలు పరిశీలించి గిరిజనులు సాగు చేసుకుంటున్న రైతులకే పోడు హక్కు పత్రాలు అందజేశారు. దరఖాస్తు దారుల్లో చాలా మందిని అనర్హులుగా ప్రకటించడంతో, పోడు వ్యవసాయం కష్టంగా మారి అటవీశాఖ అధికారుల చర్యలతో గిరిజన రైతులు కేసుల పాలవుతున్నారు. ఇక హక్కుపత్రాలు పొందిన వారు, వానాకాలం సాగు కోసం తమ భూముల్లో ట్రాక్టర్లతో దున్నేందుకు సిద్ధమవుతున్న తరుణంలో అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు తెలంగాణ అదివాసీ గిరిజన సంఘం పిలుపునిచ్చారు.

అటవీ భూముల విస్తీర్ణం తగ్గుతుందనే...

ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం నాగళ్లతోనే దున్నాలని, ఆ భూముల్లో బోర్లు సైతం వేయడం నిషేదమని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వం పోడు భూముల సాగు చేసుకునేందుకు గిరివికాస్ పథకంలో భాగంగా బోర్లు, విద్యుత్‌ను మంజూరు చేయగా, జిల్లాలో కొన్నిచోట్ల అనుమతులివ్వగా కోటపల్లి మండలంలో అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఎంపీపీ మంత్రిసురేఖా పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సమస్య కొంతవరకు పరిష్కారం చూపింది. ట్రాక్టర్లతో దున్నితే అటవీ సమీపంలో పట్టాకు మించి దున్నే అవకాశం ఉందని, అలా ఏటా కొంత పెంచుకుంటూపోతే అడవుల విస్తీర్ణం తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఇలా అయితే సాగు చేసేదెట్లా?



మాది కోటపల్లి మండలం లింగన్నపేటలో 8ఎకరాల భూమి ఉంది. దానికి అటవీ హక్కు పత్రాలు జారీ అయ్యాయి. పత్తి పంట కోసం భూమిని దున్నేందుకు ట్రాక్టర్ తీసుకురాగా అటవీ అధికారులు అడ్డుకుని, నా ద్విచక్ర వాహనం తీసుకెళ్లారు. ఇప్పటికీ రెండు వారాలు గడిచినా, అడిగితే ఇవ్వడం లేదు. ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పోడు భూముల్లో ట్రాక్టర్‌తో దున్నిన ప్రతీ రైతుది ఇదే పరిస్థితి.

– బాగాల సమ్మయ్య, లింగన్నపేట

అధికారుల దాడులు ఆపాలి



పోడు సాగుచేసుకునే రైతులపై ఫారెస్టు అధికారుల దాడులు ఆపాలి. అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి. కోటపల్లి మండలంలో ఫారెస్టు అధికారులు పోడుభూములు సాగుచేసుకునే రైతులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకర్లు స్పందించి పోడు పట్టాలు కలిగిన రైతులకు రుణాలు అందించాలి.

– ఎర్మ పున్నం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

బోనమెత్తిన గిరిజనం

వేమనపల్లి: మండలంలోని రాజారాం దశవతార దైవక్షేత్రం వద్ద రేణుక ఎల్లమ్మతో పాటు ముక్కిడిగూడం గ్రామంలోని ముసలమ్మతల్లి ఎల్లారు వద్ద రాత్రి గిరిజనులు బోనమెత్తారు. పొద్దంతా ఆటపాటలతో ఇల్లారుల వద్ద పూజలు నిర్వహించారు. చుట్టు పక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరలిరాగా, అక్కడే బోనం వండి శివసత్తుల పూనకాల మధ్య ఇల్లారు ముందు ప్రదక్షిణలు చేశారు. పంటలు సంవృద్ధిగా పండాలని కోరుకున్నారు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ రేణుక ఎల్లమ్మ దేవస్థానంతో పాటు ముక్కిడిగూడం ముసలమ్మతల్లి ఇల్లారు వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. జాతరలో ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో మద్యం, గంజాయిలాంటివి అమ్మకూడదని ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలని సూచించారు.



బందోబస్తులో నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్

క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేత



లక్సెట్టిపేట: క్రికెట్ కిట్ అందజేస్తున్న సీఐ



దండేపల్లి: క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎస్సై

దండేపల్లి/భీమిని/లక్సెట్టిపేట: దండేపల్లి మండలంలోని తానిమడుగు, అర్జుగూడ, వందుర్‌గూడ, రాజుగూడ, బేరస్‌గూడ గ్రామాల గిరిజన యువకులకు దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం క్రికెట్, వాలీబాల్ కిట్స్‌తో పాటు, టీషర్ట్స్‌ను ఎస్సై భూమేష్ అందజేశారు. భీమిని మండలంలోని ఖర్జీభీంపూర్, చిన్నగుడిపేట యువకులకు భీమిని ఎస్సై విజయ్‌కుమార్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. లక్సెట్టిపేట మండలంలోని జెండావెంకటాపూర్, వెంకట్రావ్‌పేట, చందారం, హన్మంతుపల్లె గ్రామాల్లోని యువకులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్ క్రికెట్‌కిట్లు పంపిణీ చేశారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం కళాజాత నిర్వహించారు. మూడ నమ్మకాలు, షీటీం, సైబర్ నేరాలతో పాటు పోక్సో చట్టాలపై ప్రజలకు పాటల రూపంలో వివరించారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు సూచన మేరకు కళాజాత ఏర్పాటు చేసినట్లు ఎస్సై బీ. రాములు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై భూమన్న, సిబ్బంది మాచర్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న కళాకారులు

సంక్షిప్త వార్తలు

గల్ఫ్ కార్మికునికి ఆర్థికసాయం

జన్నారం: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి, కొన్ని రోజులుగా అనారోగ్యం భారిన పడిన బాదంపల్లి గ్రామానికి చెందిన గురిజాల రవికి తోటి గల్ఫ్ కార్మికులు ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకున్నారు. మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన రవి కొన్ని సంవత్సరాలుగా ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అనారోగ్యం భారిన పడి మంచానికే పరిమితం కావడంతో తోటి గల్ఫ్ కార్మికులు రూ.21500 పోగు చేసి సోమవారం అందజేశారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

పాతమంచిర్యాల: బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థి చదువు కోసం కమ్మసేవా సమితి నాయకులు ఆర్థిక సాయం చేసి చేయూతనందించారు. జిల్లాలోని హాజీపూర్ మండలం దొనండకు చెందిన దాసరి అశ్విత బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. అశ్విత తండ్రి అనారోగ్యం పాలై కూతురును చదివించలేని స్థితిలో ఉండడంతో, అశ్విత చదువు ఖర్చుల కోసం ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను గమనించిన కమ్మసేవా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్డే వినయ్‌కుమార్ తమ సంఘ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం రూ.10వేల చెక్కును అశ్వితకు అందజేశారు.

పరిహారం చెక్కు అందజేత

బెల్లంపల్లి: ప్రమాదవశాత్తు మృతి చెందిన బెల్లంపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బానోత్ బలరాం కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రూ.2 లక్షల పరిహారం చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలు బలమని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

సామూహిక గాయత్రీ జపం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని బ్రాహ్మణ సేవ సంఘ భవనంలో సోమవారం గాయత్రీమాత జన్మదినం సందర్భంగా సామూహిక జపం నిర్వహించారు. మొదట గాయత్రీ మాత చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదలకు అన్నదానం

భీమారం: మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ నాయక్ సోమవారం మంచిర్యాలలోని రైల్వే స్టేషన్ సమీపంలోని పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నాయకులు రాజేష్‌నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.